సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 13 । జూన్ । 2024



4072 క్యూసెక్కుల వరద

సోమశిల: జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 4,072 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. బుధవారానికి 8.341 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (పది గ్రా)	రూ.73,850
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,615
3 శాతం జీఎస్టీతో	రూ.6,813
నవర (8 గ్రా)	రూ.54,504

గరిష్టం/కనిష్టం
34.2 /28.5

వాతావరణం

వాతావరణంలో తేమ 75 శాతం ఉంది. జిల్లాలో గురువారం కొన్ని చోట్ల ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుందని వాతావరణ శాఖాధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

డీసీపల్లిలో 517 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో బుధవారం 517 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 566 బేళ్లు రాగా వాటిలో 517 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 60,216 కిలోల పొగాకును విక్రయించగా రూ.1,64,55,039 వ్యాపారం జరిగింది. గరిష్టంగా కిలోకు రూ.331, కనిష్టంగా రూ.204 ధర లభించింది. సగటు ధర రూ.273.27 నమోదైంది. వేలంలో 18 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.330

కలిగిరి: కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.330 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 1,011 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 816 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారు. 195 బేళ్లను వివిధ కారణాలతో కొనుగోలు తిరస్కరించారు. వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ మాట్లాడుతూ కిలో పొగాకుకు గరిష్టంగా రూ.330, కనిష్టంగా రూ.205 ధర లభించగా, సగటున రూ.283.15 ధర లభించిందన్నారు. వేలంలో 14 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

ముమ్మరంగా పొగాకు కొనుగోళ్లు

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు పొగాకు బోర్డు పరిధిలో కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నట్లు ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలో బుధవారం 9,931 బేళ్లు రాగా, 8,864 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారని, 1,067 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. ఒంగోలు, కొండపి కేంద్రాల్లో 79వ రోజు వేలంలో 4752 బేళ్లు రాగా, 4321 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 431 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్టంగా రూ.331 కాగా, కనిష్టంగా రూ.205, సగటు ధర రూ.283.34 వచ్చింది. మార్చి 6న ప్రారంభమైన డీసీపల్లి, కలిగిరి, కందుకూరు-2, ఒంగోలు-2, వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి తదితర కేంద్రాల్లో 74వ రోజు వేలం పాటలు జరుగుతున్నట్లు చెప్పారు. ఆయా కేంద్రాల్లో 5179 బేళ్లు రాగా, 4543 బేళ్లు కొనుగోలయ్యాయని, 636 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. అందులో గరిష్టంగా రూ.331, కనిష్టంగా రూ.205, సరాసరి రూ.281.08 పడినట్లు చెప్పారు.

పచ్చిరొట్ట పైర్లతో భూమి సారవంతం

- పొగాకు బోర్డు ఆర్‌ఎం లక్ష్మణరావు



మాట్లాడుతున్న ఆర్‌ఎం లక్ష్మణరావు

ఒంగోలు సెంట్రల్: పొగాకు రైతులు పచ్చిరొట్ట పైర్లను విరివిగా పెంచి భూసారం పెంపొందించుకోవాలని పొగాకు బోర్డు ఆర్‌ఎం లక్ష్మణరావు సూచించారు. బుధవారం ఆయన కార్యాలయంలో రైతులు, వివిధ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆర్‌ఎం మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువుల ప్రాధాన్యతను రైతులకు వివరించి ఎక్కువ మొత్తంలో సాగయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. నేల భౌతిక లక్షణాలు పెంపొందించడం, నత్రజని, ఇతర పోషకాలు లోపలి పొరలకు ప్రవేశించడం, కలుపు మొక్కలను సమూలంగా నిర్మూలించేందుకు పచ్చిరొట్ట పైర్లు ఉపయోగపడతాయని చెప్పారు. ఎకరానికి 15 నుంచి 20 కేజీల విత్తనాలు చల్లి 50 నుంచి 55 రోజుల తర్వాత అంటే పూత దశకు రాక ముందే పంటను నేలలో కలియదున్నితే భూసారం పెరిగి తర్వాత సాగు చేసే పంటదిగుబడి పెరుగుతుందని, భూమికి నీటిని నిల్వ చేసే సామర్థ్యం పెరుగు తుందని, రసాయనిక ఎరువులు వేసే పరిమాణం కూడా తగ్గుతుందని చెప్పారు. సేంద్రియ కర్బన శాతం కూడా పెరుగుతుందన్నారు. విరివిగా పచ్చి రొట్ట పైర్లు వేసి నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేయాలని సూచించారు. రైతు సంఘ నాయకులు, ఐటీసీ, జీపీఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం వెంకటగిరిలోని ఎన్‌జేఆర్ భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చామన్నారు. అయినప్పటికీ 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును స్వీకరిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలోనే టీడీపీ ఇచ్చిన హామీలన్నీ చిత్తశుద్ధితో నెరవేర్చాలని కోరారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై తప్పుడు కేసులు బనాయించడం, కక్ష పూరిత చర్యలకు పాల్పడితే సహించేది లేదన్నారు.

బడికి పోదాం

వేసవి సెలవులు యాభై రోజుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది ముందుగా నిర్దేశించిన తేదీ కాకుండా.. కొత్త ప్రభుత్వం కొలువుదీరడం కోసం ఒక్క రోజు ఆలస్యంగా బడులు తెరుచుకుంటున్నాయి. ఇన్నాళ్లు ఆట, పాటలు, అల్లరితో ఇళ్లల్లో సందడి చేసిన విద్యార్థులు గురువారం నుంచి బడి బాట పట్టనున్నారు. విద్యార్థులకు అందించే కానుక కిట్లను గత ప్రభుత్వం ముందస్తుగానే సిద్ధం చేసింది. పాఠశాలలు తెరిచిన రోజే వాటిని విద్యార్థులకు అందించనున్నారు. ఇప్పటికే కిట్లన్నీ పాఠశాలలకు చేర్చింది.



రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో అందజేస్తాం

విద్యార్థులకు రెండు మూడు రోజుల్లో విద్యా కానుక కిట్లను అందజేస్తాం. 100 శాతం పాఠ్య, నోటు పుస్తకాలు, బెల్టులు వచ్చాయి. 50 శాతం యూనిఫాం వచ్చింది. బ్యాగ్‌లు, బూట్లు 25 శాతం పాఠశాలలకు చేరాయి. మిగిలినవి ట్రాన్స్‌పోర్టులో ఉన్నాయి. వీటిని తెప్పించి రెండు రోజుల్లో పూర్తిగా అందజేస్తాం. ప్రస్తుతం ఉన్న వాటిని బడి తెరిచిన రోజే విద్యార్థులకు అందజేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

– పీవీజే రామారావు, డీఈఓ

- నేటి నుంచి తెరుచుకోనున్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు
- గత ప్రభుత్వ హయాంలోనే సిద్ధం చేసిన విద్యాకానుక
- ఇప్పటికే ఆయా పాఠశాలలకు చేరిన కిట్లు
- నేటి నుంచి 1,74,660 మంది విద్యార్థులకు అందజేయనున్న వైనం
- ప్రైవేట్ పాఠశాలల్లో 1,72,230 మంది విద్యార్థులు

నెల్లూరు (టౌన్): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం నుంచి కొత్త విద్యా సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 24వ తేదీ నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించారు. సంప్రదాయంగా జూన్ 12వ తేదీన పాఠశాలలు పునః ప్రారంభం కావాల్సి ఉండగా, కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం నేపథ్యంలో ఒక్క రోజు ఆలస్యంగా 13వ తేదీ నుంచి పాఠశాలలు తెరుచుకుంటున్నాయి. దీంతో విద్యార్థులకు బడి బాట పట్టేందుకు బ్యాగుల బూజు దులిపి సిద్ధమయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్ల పేరుతో తొమ్మిది రకాల వస్తువులను అందజేయనున్నారు. ఇప్పటికే కొన్ని రకాల వస్తువులు జిల్లాలోని ఆయా మండల కేంద్రాలకు చేరాయి. అక్కడ నుంచి స్కూల్ కాంప్లెక్స్‌లకు చేర్చి నేరుగా పాఠశాలలకు అందజేయనున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు డిజిటల్ విద్య, ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్‌ఈ సిలబస్ బోధిస్తున్నారు. పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించారు. బాల, బాలికలకు సరిపడా మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంట్లు, క్రీడా మైదానం, కుర్చీలు, బెంచీలు, గ్రీన్‌చాక్ బోర్డు, లైట్లు, ఫ్యాన్లు తదితర వాటిని ఏర్పాటు చేశారు.

జిల్లాలో 3.54 లక్షల మంది విద్యార్థులు

జిల్లాలో 3,200కు పైగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 3,54,104 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరూ పాఠశాలలు పునః ప్రారంభించనుండటంతో బడిబాట పట్టనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1,74,660 మంది విద్యార్థులకు అందజేయనున్నారు. విద్యార్థులకు అందజేయనున్న విద్యాకానుక కిట్లలో యూనిఫాం 3 జతలు, బూట్లు, సాక్స్‌లు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగు, బెల్టు, టై తదితర వస్తువులను అందజేయనున్నారు. జిల్లాకు బ్యాగులు 16,304, 79,173 యూనిఫాంలు, 12,130 బూట్లు, 9,62,728 నోటు పుస్తకాలు, 1,22,147 బెల్టులు తదితర వస్తువులు జిల్లాకు చేరుకున్నాయి. మిగిలిన వస్తువులు నేడు, రేపో జిల్లాకు చేరుకున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు

తరగతి	విద్యార్థులు
1వ తరగతి	18,260
2వ తరగతి	15,292
3వ తరగతి	16,045
4వ తరగతి	13,907
5వ తరగతి	18,091
6వ తరగతి	20,331
7వ తరగతి	18,239
8వ తరగతి	19,107
9వ తరగతి	17,904
10వ తరగతి	17,484



డిజిటల్ విద్య సాఫీగా సాగేనా?

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం అమలవుతున్న పలు పథకాలు నూతన విద్యాబోధన సాఫీగా సాగేనా అనుమానం విద్యార్థుల తల్లిదండ్రుల్లో నెలకొంది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో గోరుముద్ద, సీబీఎస్‌ఈ సిలబస్, ఇంగ్లిష్ మీడియం, విద్యాకానుక కిట్లు, బైజూస్ బోధన, వర్చువల్ విధానం, తదితర వాటిని పకడ్బందీగా అమలు చేస్తున్నారు. నాడు-నేడు తొలి విడతలో జిల్లాలో 1,059 పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించారు. నాడు-నేడు రెండో విడతలో మరో 1,150 పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు పదవి బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఈ పథకాలతో పాటు విద్యా విధానం అమలవుతుందో లేదోనన్న అనుమానం ఉంది. తొలుత నుంచి చంద్రబాబు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియాన్ని వ్యతిరేకిస్తున్నారు. నాడు-నేడు రెండో విడతలో జరుగుతున్న పాఠశాలలకు నిధులు విడుదల చేయాల్సి ఉంది. వీటన్నింటిని పూర్తి చేస్తారా లేక పెండింగ్‌లో పెడతారో వేచి చూడాల్సి ఉంది.

పంజా విసిరిన దొంగలు

రైల్వే సిగ్నల్స్‌ను ట్యాంపర్ చేసి పరుగులు తీసే రైళ్లను ఆపి, రిజర్వేషన్ బోగీల్లో దోపిడీకి పాల్పడుతున్న దుండగులు కొంత కాలం విరామం తర్వాత మరోసారి చెలరేగిపోయారు. రిజర్వేషన్ బోగీల్లో భద్రతను పర్యవేక్షించే రైల్వే పోలీసులకు దొంగలు మరోసారి సవాల్ విసిరారు. తొమ్మిది నెలల క్రితం ఇదే తరహాలో పంజా విసిరిన దుండగులపై నిఘా పెరగడంతో అప్పటి నుంచి విరామం ప్రకటించారు. ఆదమరిచి తాజాగా రెండు రైళ్లకు సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి ఆపి రిజర్వేషన్ బోగీల్లో గాఢ నిద్రలో ఉన్న మహిళా ప్రయాణికుల వద్ద బంగారు నగలు, బ్యాగులు దోచుకెళ్లారు. ఉలికి పడిన రైల్వే పోలీసులు విభిన్న కోణాల్లో దర్యాప్తును ప్రారంభించారు.

- సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి రెండు రైళ్లలో దోపిడీ
- శ్రీవెంకటేశ్వరపాళెం రైల్వేస్టేషన్ సమీపంలో అర్ధరాత్రి తర్వాత స్వైర విహారం
- మహిళా ప్రయాణికుల మెడల్లోని బంగారు అభరణాలు, బ్యాగుల అపహరణ
- భిన్న కోణాల్లో దర్యాప్తు చేపట్టిన రైల్వే పోలీసులు



శ్రీవెంకటేశ్వరపాళెం రైల్వే స్టేషన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు దోపిడీకి పాల్పడిన ప్రదేశం

బిట్రగుంట: సిగ్నలింగ్ వ్యవస్థను ట్యాంపర్ చేసి రైళ్లలో దోపిడీకి పాల్పడే ముఠా మరోసారి పంజా విసిరింది. ఈ తరహా ఘటనలకు బిట్రగుంటకు సమీపంలోని శ్రీవెంకటేశ్వరపాళెం రైల్వేస్టేషన్‌కు అటూ ఇటూ ప్రాంతం అనువుగా ఉండడంతో దుండగులు చెలరేగిపోతున్నారు. తాజాగా శ్రీవెంకటేశ్వరపాళెం రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు రైల్వేసిగ్నల్స్‌ను ట్యాంపర్ చేసి రెండు రైళ్లలో దోపిడీకి పాల్పడ్డారు. నలుగురు మహిళా ప్రయాణికుల మెడల్లోని బంగారు అభరణాలు, బ్యాగులు దోపిడీ చేశారు. దోపిడీని అడ్డుకోవడానికి ప్రయత్నించిన ఒక ప్రయాణికుడిపై రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. మిగిలిన ప్రయాణికులు తేరుకునే లోపే కొండబిట్రగుంట అటవీ ప్రాంతం మీదుగా పారిపోయారు.

సిగ్నల్ ట్యాంపర్ చేసి..

కావలి- శ్రీవెంకటేశ్వరపాళెం రైల్వేస్టేషన్ల మధ్య దుండగులు బుధవారం తెల్లవారుజామున 1.50 గంటల సమయంలో నెల్లూరు వైపు వెళ్లే మార్గంలో సిగ్నల్ ట్యాంపర్ చేసి సిగ్నల్స్ కనిపించకుండా చేశారు. ఆ సమయంలో నరసాపురం నుంచి ధర్మవరం వెళ్తున్న (రైలు నంబరు 17247) ధర్మవరం ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్ సిగ్నల్స్ కనిపించకపోవడంతో రైలు వేగాన్ని పూర్తిగా తగ్గించాడు. ప్రయాణికులందరూ గాఢ నిద్రలో ఉన్నారు. దీంతో రైల్లోకి ప్రవేశించిన దుండగులు ఎస్-13 బోగీలో బెర్త్ నంబరు 12లో నిద్రిస్తున్న ఓ మహిళా ప్రయాణికురాలు మెడలోని బంగారు గొలుసును, ఎస్-11 బోగీలో బెర్త్ నంబర్ 25లో నిద్రిస్తున్న మరో మహిళ బ్యాగును చోరీ చేశారు. ఈ బ్యాగులో సెల్‌ఫోన్‌తో పాటు దుస్తులు ఉన్నాయి. అంతలోనే సిగ్నలింగ్ వ్యవస్థలో ఎటువంటి సమస్య లేదని స్టేషన్ మాస్టర్ నుంచి సమాచారం రావడంతో లోకోపైలట్ ట్రైన్ వేగాన్ని పెంచడంతో దుండగులు రైలు దిగేసి అక్కడే మాటు వేశారు. 2.15 నుంచి 2.30 గంటల మధ్య షిర్డీసాయినగర్ నుంచి తిరుపతి వెళ్తున్న (రైలు నంబరు 07638) తిరుపతి స్పెషల్ ట్రెయిన్ కూడా సిగ్నల్స్ లేక ఎస్వీపీఎం స్టేషన్ సమీపంలో నిలిపేయడంతో దుండగులు మళ్లీ ట్రెయిన్‌లోకి ప్రవేశించారు. ఎస్-3, ఎస్-5 బోగీల్లోకి ప్రవేశించారు. ఎస్-5 కోచ్‌లో తిరుపతికి వెళ్తున్న ప్రయాణికురాలి మెడలోని 20 గ్రాముల బంగారు దండను లాక్కున్నారు. ఎస్-3 కోచ్‌లో మరో ప్రయాణికురాలి మెడలోని 18 గ్రాముల బంగారు దండను కూడా లాక్కున్నారు. ఈ క్రమంలో ప్రయాణికురాలి భర్త పాపారావు దొంగలను అడ్డుకునేందుకు ప్రయత్నించగా రాళ్లతో దాడి చేసి రైలు దిగేసి కొండ బిట్రగుంట అటవీ ప్రాంతం మీదుగా పారిపోయారు. రాళ్ల దాడిలో పాపారావు తలకు స్వల్పంగా గాయలయ్యాయి. బాధితులు, రైల్వే సిబ్బంది సమాచారంతో రైల్వే పోలీసులు హుటాహుటినా సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. సిగ్నలింగ్ వ్యవస్థను ఏ విధంగా ట్యాంపర్ చేశారనే విషయంపై స్పష్టత రాలేదు.

9 నెలల తర్వాత మళ్లీ..

సిగ్నలింగ్ వ్యవస్థను ట్యాంపర్ చేసి రైళ్లలో దోపిడీకి పాల్పడిన ఘటనలు గతేడాది వరుసగా చోటు చేసుకున్నాయి. గతేడాది జూన్ 24వ తేదీ తెల్లవారుజామున తెట్టు వద్ద సిగ్నలింగ్ వ్యవస్థను ట్యాంపర్ చేయడం ద్వారా చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీకి పాల్పడ్డారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తుండగానే రెండు నెలల వ్యవధిలో అదే ఏడాది ఆగస్టు 14వ తేదీ తెల్లవారు జామున వీరేపల్లి వద్ద చెన్నై ఎక్స్‌ప్రెస్, తెట్టు రైల్వే బ్రిడ్జి వద్ద చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీకి పాల్పడ్డారు. ఇదే తరహాలో సెప్టెంబర్ 16వ తేదీన సింగరాయకొండ వద్ద చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో, సెప్టెంబర్ 18న అల్లూరు రోడ్డు వద్ద పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీకి విఫలయత్నం చేశారు. దీంతో పోలీసులు రైళ్లు, రైల్వే స్టేషన్లలో గస్తీ ముమ్మరం చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ముమ్మరం చేయడంతో దుండగలు కొంత కాలంగా విరామం ప్రకటించారు. అల్లూరు రోడ్డు ఘటన తర్వాత ఇటువంటి ఘటనలు మళ్లీ చోటుచేసుకోలేదు. తిరిగి 9 నెలల తర్వాత శ్రీవెంకటేశ్వపాళెం వద్ద ఇదే తరహాలో దొంగలు పంజా విసిరి రెండు రైళ్లలో దోపిడీకి పాల్పడ్డారు. అయితే బోగీల్లో గస్తీ కాసే పోలీసులు ఆ సమయంలో ఏమయ్యారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. రిజర్వేషన్ బోగీల్లో లైట్లు ఆపేసి, ప్రయాణికులందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఇలాంటి ఘటనలు జరుగుతుండడంతో దుండగులను పసిగట్టలేని, పట్టుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది.

భిన్న కోణాల్లో దర్యాప్తు

రైళ్లలో దోపిడీ ఘటనలపై రైల్వే పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సమాచారం అందుకున్న 15 నిమిషాల్లోనే సంఘటనా స్థలానికి చేరుకోవడంతో పాటు గత అనుభవాలను కూడా పరిగణలోకి తీసుకుని దర్యాప్తును వేగవంతం చేశారు. సాంకేతిక ఆధారాలు, ఫీల్డ్ ఇన్ఫర్మేషన్ ఆధారంగా అనుమానితుల వివరాలు సేకరిస్తున్నారు.

సీనియారిటీ కలిపిన తర్వాతే బదిలీలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోని నెల్లూరు, వెంకటగిరి యూనిట్లలో సీనియారిటీ జాబితాను కలిపిన తర్వాతే బదిలీలకు అనుమతించాలని ఇరిగేషన్ సర్కిల్స్ స్కేల్ ఉద్యోగులు కోరారు. బుధవారం జలవనరులశాఖ ఎస్‌ఈ కృష్ణమోహన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. గూడూరు ఇరిగేషన్ సర్కిల్ 1996లో రద్దు చేయడంతో ఆ సర్కిల్ పరిధిలో ఉన్న డబ్ల్యూఎం డివిజన్ వెంకటగిరి, నెల్లూరు సర్కిల్స్‌లో చేర్చడం జరిగిందన్నారు. అప్పటి నుంచి నెల్లూరు ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో రెగ్యులర్ డివిజన్ ఉద్యోగులు ఒక యూనిట్‌గా ఏర్పడి డబ్ల్యూఎం డివిజన్, వెంకటగిరి ఉద్యోగులు మరో యూనిట్‌గా పరిగణించబడుతూ ప్రతి కేడర్‌కు వేర్వేరుగా రెండు సీనియార్టీ జాబితాలను నిర్వహిస్తుందన్నారు. రెండు సీనియారిటీ జాబితాలతో నెల్లూరు యూనిట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు సర్వీస్ పరంగా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందన్నారు. పదోన్నతుల విషయంలో వెంకటగిరి ఉద్యోగులకు వచ్చినట్లుగా నెల్లూరు యూనిట్ ఉద్యోగులకు రావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో సర్కిల్ పరిధిలో ఉన్న అన్ని డివిజన్లను ఒకే యూనిట్‌గా పరిగణించి అన్ని కేడర్ల ఉద్యోగులకు ఒకే సీనియారిటీ జాబితాను తయారు చేయాలన్నారు. ఈ ప్రక్రియ పూర్తి చేసిన తర్వాతే బదిలీల ప్రక్రియ చేపట్టాలని ఇరిగేషన్ నెల్లూరు యూనిట్ ఉద్యోగులు ఆ వినతి పత్రంలో కోరారు.

ఆశ పడి.. భంగపడి..

రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వంలో జిల్లాకు రెండు మంత్రి పదవులు వరించాయి. గతంలో మంత్రులుగా పని చేసిన అనుభవం ఉన్న ఇద్దరు మాజీ మంత్రులకే మళ్లీ అమాత్యులుగా అవకాశం ఇచ్చారు. అయితే మంత్రి పదవులు ఆశించిన ఆ ముగ్గురికి భంగపాటు తప్పలేదు. జిల్లాలో మంత్రుల కేటాయింపులో వైఎస్సార్‌సీపీ ఫార్ములానే టీడీపీ అనుసరించిందని చెప్పొచ్చు. వైఎస్సార్‌సీపీ మంత్రులుగా యువతకు ప్రాధాన్యం ఇస్తే.. టీడీపీ మాత్రం సీనియర్లకే ప్రాధాన్యం ఇచ్చింది.



- కోటంరెడ్డి, సోమిరెడ్డి, వేమిరెడ్డి పోటీ
- వైఎస్సార్‌సీపీ ఫార్ములానే అనుసరించిన టీడీపీ
- ఆత్మకూరు, నెల్లూరు సిటీ నియోజకవర్గ ఎమ్మెల్యేలకే మంత్రి పదవులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సార్వత్రిక ఎన్నికల్లో గతంలో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేసిన విధంగానే.. ఈ దఫా టీడీపీ క్లీన్ స్వీప్ చేసింది. అయితే జిల్లాలో మంత్రి వర్గంలో స్థానానికి ఐదుగురు పోటీ పడినప్పటికీ ఇద్దరికే దక్కాయి. ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పొంగూరు నారాయణలకే నూతన మంత్రి వర్గంలో చోటు కల్పించారు. ఐదుసార్లు మంత్రిగా సుదీర్ఘ పరిపాలన, రాజకీయ అనుభవం ఉన్న ఆనంతో పాటు టీడీపీకి ఆర్థిక వెన్నుదన్నుగా నిలిచిన విద్య, వైద్యరంగాల్లో వ్యాపారవేత్త, టీడీపీలో మంత్రిగా పనిచేసిన నారాయణకు మరోసారి పట్టం కట్టారు.

ఆ ముగ్గురికి మొండి చెయ్యి

రాష్ట్ర మంత్రి వర్గంలో చోటు కోసం మాజీ మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో పాటు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పోటీ పడ్డారు. ఎవరికి వారు మంత్రి పదవుల కోసం చివరి వరకు తీవ్రంగా ప్రయత్నించారు. లోకేష్ కోటరీగా ఉన్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చాలా తీవ్రంగా ప్రయత్నించారు. ఇక టీడీపీలో సీనియర్ నేత, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విశ్వప్రయత్నాలు చేసినా ఫలితం దక్కలేదు. ఆయన టికెట్ కోసం చివరి వరకు త్రిశంకుస్వర్గంలో ఉండిపోయారు. ఎట్టకేలకు టికెట్ దక్కించుకుని గెలిచారు. తాను అంతర్గతంగా వ్యతిరేకించే ఆనం, పొంగూరుతో ఎలా పొసగుతారో చూడాల్సి ఉంది. ఇక కేంద్ర మంత్రి వర్గంలో చోటు దక్కుతుందని, తొలుత భావించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి అవకాశం రాలేదు. కేంద్ర పదవి రాకపోవడంతో రాష్ట్రంలోనైనా మంత్రి వర్గంలో తన సతీమణి కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి అవకాశం కల్పించాలని వేమిరెడ్డి ప్రయత్నం చేశారు. కానీ ఆమెకు చోటు దక్కలేదు

వైఎస్సార్‌సీపీ ఫార్ములానే..

గత వైఎస్సార్‌సీపీ ఫార్ములానే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అనుసరించింది. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సామాజిక వర్గాల కోణంతో పాటు యువతకు ప్రాధాన్యం ఇస్తూ నెల్లూరు సిటీ, ఆత్మకూరు నియోజకవర్గాల్లో విజయం సాధించిన అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డిలకు తొలి విడతలో మంత్రి పదవులు ఇచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం అదే సామాజికతకు ప్రాధాన్యత కల్పించినప్పటికీ, యువతకు కాకుండా సీనియర్లకు ప్రాధాన్యం ఇస్తూ నెల్లూరు సిటీ నుంచి నారాయణ, ఆత్మకూరు నుంచి ఆనం రామనారాయణరెడ్డిలకే మంత్రి వర్గంలో చోటు కల్పించడం విశేషం. రాజకీయంగా సుదీర్ఘ అనుభవం, జిల్లాపై పట్టు ఉన్న ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికే నూతన కూటమి ప్రభుత్వం పట్టం కట్టబెట్టింది. రాజకీయ కుటుంబ నేపథ్యం ఉన్న ఆనం టీడీపీకి పాతకాపే. టీడీపీలో ఎన్టీఆర్, వైఎస్సార్, కిరణ్‌కుమార్‌రెడ్డి కేబినెట్లలో మంత్రిగా పనిచేశారు. తాజాగా చంద్రబాబు కేబినెట్లో మంత్రి పదవి దక్కింది. టీడీపీ అధినేత చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడిగా ఉన్న నారాయణ విద్యా సంస్థల అధినేత నారాయణకు మరోసారి మంత్రి పదవి వరించింది. టీడీపీకే ఆర్థిక వెన్నుదన్నుగా ఉంటూ చంద్రబాబుతో సత్సంబంధాలు ఉన్న నారాయణకే ప్రాధాన్యత ఇచ్చి విధేయతకు పట్టం కట్టారు.

జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్

- చంద్రబాబు ప్రమాణ స్వీకారం రోజే ప్రజల ఇక్కట్లు
- ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకొని ప్రజల పాట్లు



టంగుటూరు టోల్ ప్లాజా వద్ద కిలో మీటర్ల మేర నిలిచిన వాహనాలు

టంగుటూరు: చంద్రబాబు ప్రమాణ స్వీకారం రోజే ప్రజలకు ఇక్కట్లు మొదలయ్యాయి. ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకొని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టంగుటూరు టోల్ ప్లాజా వద్ద బుధవారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు పోలీసులు ఇతర వాహనాలు, లారీలను, కాలేజీ బస్సులను నిలిపేసి కేవలం చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి పోతున్న కార్లు, బస్సులను వదలడంతో ఏడు, ఎనిమిది కిలోమీటర్ల ట్రాఫిక్ జామ్ అయ్యి ప్రజలు, కూలి పనులకు పోయే పేదలు, విద్యార్థులు అవస్థలు పడ్డారు. ట్రాఫిక్ జామ్ కావడంతో లారీ డ్రైవర్లు మంచి నీరు, అల్పాహారం లేక కడుపు మాడ్చుకున్నారు. ప్రమాణ స్వీకారానికే ఇలా ఇబ్బందులు పెట్టారు, ఇక ఐదేళ్ల పాలన ఊహించుకుంటే భయమేస్తుందని ప్రజలు అంటున్నారు.

రైలు ప్రయాణంలో సమస్యలకు చెక్

- ప్రయాణికుల కోసం ప్రత్యేక యాప్
- 'రైల్ మదద్'లో ఫిర్యాదులు చేయొచ్చు
- స్పందించనున్న రైల్వే శాఖ

నెల్లూరు(క్రైమ్): ప్రయాణికుల విషయంలో జవాబుదారీతనంగా వ్యవహరించేందుకు రైల్వే శాఖ వినూత్న కార్యక్రమాలను చేపడుతోంది. ఇప్పటికే వారి భద్రతకు సంబంధించి వివిధ రకాల సేవల నిమిత్తం టోల్‌ఫ్రీ నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. రైల్లో ప్రయాణించే వారికి ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే ఫిర్యాదు చేసేందుకు వీలుగా రైల్ మదద్ యాప్‌ను ప్రవేశపెట్టింది. స్టేషన్లలో అపరిశుభ్రత, రైల్లో భద్రత, సిబ్బంది నిర్లక్ష్యం, అవినీతి ఇలా 35 రకాల సమస్యలపై యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్‌చేసి ఫిర్యాదు చేయొచ్చు. దీంతో ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరిస్తారు. ఈ యాప్‌లో ఫిర్యాదు చేసే ప్రయాణికులు రిజర్వేషన్, జనరల్, ప్లాట్‌ఫారం టికెట్లలో ఏదో ఒకటి తప్పనిసరిగా కలిగి ఉండాలి.

వేటిపై ఫిర్యాదు చేయొచ్చంటే..

రైల్వేస్టేషన్‌లో అపరిశుభ్ర వాతావరణం, నీటి కొరత, వెయిటింగ్ హాళ్లో కనీస సౌకర్యాలు కరువు, రిజర్వేషన్ చేసినా వెయిటింగ్ జాబితాలో ఉండడం, టీటీఈ, ఇతర సిబ్బంది అవినీతి, రైలు సిబ్బంది నిర్లక్ష్యం, దురుసు ప్రవర్తన, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, వస్తువుల అపహరణ, గొలుసు దొంగతనాలు, కొట్లాటలు పొగ, మద్యసేవనం, గొడవలు, మహిళల పట్ల అసభ్యకర ప్రవర్తన, ఆకతాయిల వేధింపులు, మరుగుదొడ్లు, బోగీల్లో అపరిశుభ్రత, నాణ్యత లేని ఆహారం, ప్యాంట్రీ కార్‌లో అపరిశుభ్రత, అధిక ధరలకు తినుబండారాలు అమ్మడం, ఏసీ, ఫ్యాన్లు, లైట్లు, చార్జింగ్ పాయింట్‌లు పనిచేయకపోవడం, బెడ్‌రోల్స్ అపరిశుభ్రంగా ఉండడం, రైళ్ల రాకపోకల్లో ఆలస్యం తదితర సమస్యలపై యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు.





ఫిర్యాదు చేయొచ్చిలా..

నిరంతర పర్యవేక్షణ

రైల్ మదద్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులపై రైల్వే జనరల్ మేనేజర్, డివిజనల్ మేనేజర్‌లు నేరుగా పర్యవేక్షిస్తారు. ఫిర్యాదు స్థాయిని బట్టి సంబంధిత విభాగానికి చెందిన ముఖ్య అధికారికి పంపి సమస్యను పరిష్కరించాలని ఆదేశిస్తారు. వారు సమస్యను పరిష్కరించి అందుకు సంబంధించిన వివరాలను ఫిర్యాదుదారుని సెల్‌ఫోన్‌కు మెసేజ్ రూపంలో పంపుతారు. ఈ యాప్ ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైల్వే అధికారులు సూచిస్తున్నారు.

యాప్ డౌన్‌లోడ్ ఇలా..

ప్రయాణికులు ప్లేస్టోర్‌లోకి వెళ్లి రైల్ మదద్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. వ్యక్తిగత వివరాలు, సెల్‌ఫోన్, ఈ–మెయిల్ తదితర వివరాలను నమోదు చేయాలి. సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీని నమోదు చేయడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ యాప్ ద్వారా ప్రయాణికుడు రైల్లో, స్టేషన్లలో వివిధ సమస్యలపై ఫిర్యాదు చేయొచ్చు. ఆధారాల కోసం యాప్ ద్వారా ఫొటోలను సైతం అప్‌లోడ్‌చేయాలి. సంబంధిత అధికారులకు సూచనలు, సలహాలు సైతం ఇవ్వొచ్చు. ప్రతి ఫిర్యాదుకు రిఫరెన్స్ నంబర్ ఉంటుంది. దాంతో ఫిర్యాదు స్టేటస్ తెలుసుకోవచ్చు. సమస్య పరిష్కారంకాగానే ఫిర్యాదుదారుకి ఎస్‌ఎంఎస్, ఈ–మెయిల్ వస్తుంది.



బాలల హక్కులు కాపాడాలి : డీఎంహెచ్‌ఓ



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

నెల్లూరు(వేదాయపాళెం): బాలలకు కల్పించిన హక్కులను కాపాడాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలల సంరక్షణ విభాగం, జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరులోని గాంధీబొమ్మ నుంచి వీఆర్సీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ బాలబాలికలు బడిలో మాత్రమే ఉండాలన్నారు. వారిని బాగా చదివించాలన్నారు. అప్పుడే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్ మాట్లాడుతూ పేదరికం, నిరక్షరాస్యత వల్ల పలువురు తమ చిన్నారులను పనులకు పంపిస్తున్నారన్నారు. శ్రమ దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. బాలలను పనిలో పెట్టుకుంటే చట్టపరంగా తీసుకునే చర్యలు, శిక్షలు వివరించారు. కార్యక్రమంలో డీసీఎల్ వెంకటేశ్వర్లు, దిశ పోలీస్ విభాగం నుంచి సతీష్, చైల్డ్ లేబర్ విభాగం సిబ్బంది హరిబాబు, శ్రీనివాసులు, రామారావు, సీడబ్ల్యూసీ సభ్యుడు శ్రీనివాసరావు, సీజేడబ్ల్యూఎస్ డైరెక్టర్ శ్రీనివాసరావు, సమగ్ర బాలల సంరక్షణ సిబ్బంది, దుర్గా నర్సింగ్ కాలేజీ విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 6.486 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 6.486 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 20, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అలంకారప్రాయంగా..

నెల్లూరు(అర్బన్): నెల్లూరు సంతపేటలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో లిఫ్ట్ పని చేయడం లేదు. మూడు అంతస్తుల డీఎంహెచ్‌ఓ భవనం నిర్మించే సమయంలో లిఫ్ట్‌ను ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అయితే ఏ కారణం చేతనో ఆ పనులు పూర్తి కాలేదు. గత డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి లిఫ్ట్ పనులు పూర్తి చేయించి వినియోగంలోకి తెచ్చారు. ఇందుకోసం రూ.లక్షలు వెచ్చించారు. సుమారు ఎనిమిది నెలల నుంచి లిఫ్ట్ పని చేయడం లేదు. మరమ్మతులకు గురైంది. జిల్లా నలుమూలల నుంచి పెన్షనర్లు, వయసు మళ్లిన ఉద్యోగులు డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి పనుల నిమిత్తం వస్తుంటారు. అంతేకాకుండా బెడ్‌రిడన్ (మంచంపై నుంచి లేవలేని) రోగులకు వంద శాతం పింఛన్ రావాలంటే అలాంటి వారి కోసం డీఎంహెచ్‌ఓ సంతకం చేయాల్సి ఉంటుంది. ఇలా పలు రకాల వ్యక్తులు ఈ కార్యాలయానికి వస్తారు. వీరు మెట్లు ఎక్కలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లిఫ్ట్‌కు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై డీఎంహెచ్‌ఓ పెంచలయ్యను వివరణ కోరగా త్వరలోనే మరమ్మతులు చేయిస్తామన్నారు.



నిఘా కళ్లు.. భద్రతకు దన్ను

- నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం
- ఇళ్లు, అపార్ట్‌మెంట్లలో అమర్చుకుంటున్న వైనం

నెల్లూరు(బారకాసు): నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర చాలా కీలకం. బ్యాంకులు, ఏటీఎం సెంటర్లు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు, అపార్ట్‌మెంట్లు, హోటళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, బంగారు షాపుల్లో వీటిని తప్పనిసరిగా ఏర్పాటు చేసుకుని ఉంటారు. ప్రస్తుతం మధ్య తరగతి ప్రజలు సైతం తమ ఇళ్ల వద్ద కూడా వీటిని అమర్చుకుంటున్నారు.

కష్టపడి పనిచేసి డబ్బు పొదుపు చేసుకుని కొనుగోలు చేసిన నగలు, నగదు పోతే ఆ బాధ వర్ణనాతీతంగా ఉంటుంది. ఇంటికి తాళం వేసి కొద్దిరోజులు వేరే ఊరికి వెళ్తే చాలు దొంగలు రెచ్చిపోతున్నారు. పట్టపగలే తాళాలు పగులగొట్టి సొత్తు చోరీ చేస్తున్న సందర్భాలు బయట పడుతూనే ఉన్నాయి. ఒక్కోసారి హత్యలకు కూడా వెనుకాడడం లేదు. ఈ నేపథ్యంలో ప్రజలు సొంత నిఘాపై దృష్టి సారించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు. వీటి వల్ల ఏదైనా ఘటనలో దొంగలను ఇట్టే గుర్తుపట్టి పట్టుకునే అవకాశం ఉంది.


నెల్లూరు నగరంతోపాటు శివారుప్రాంతాల్లో కొత్తగా వెలసిన కాలనీల్లో నివసించే వారంతా ఇప్పుడు ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించుకుంటున్నారు. ఇంటికి అపరిచిత వ్యక్తులు వస్తే ఇట్టే పసిగట్టవచ్చు. వచ్చిన వారు అనుమానాస్పదంగా ఉంటే వెంటనే సమాచారాన్ని ఇరుగుపొరుగు వారికి తెలియజేయొచ్చు. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లిన సమయంలో ఎవరెవరు వచ్చారో సెల్‌ఫోన్‌లో చూసుకోవచ్చు. దొంగల భయంతో ఉద్యోగులు, వ్యాపారులు తమ ఇళ్లకు నిఘా కళ్లను పెట్టిస్తున్నారు.

చాలా రకాలు

మార్కెట్లో అనేక రకాల సీసీ కెమెరాలు దర్శనమిస్తున్నాయి. ఐఆర్ డూమ్, ఐఆర్ బుల్లెట్, జూమింగ్ కెమెరాలు వినియోగంలో ఉన్నాయి. పగటి పూట మాత్రమే పనిచేసే డూమ్ కెమెరాలను ఒకచోట అమర్చితే ఆ పరిధిలోకి వచ్చే చిత్రాలను అవి రికార్డు చేస్తాయి. వీటి ధర రూ.2,500 నుంచి రూ.3,000కు పైచిలుకు వరకు ఉంది. ఐఆర్ బుల్లెట్ కెమెరాలు కాస్త దూరంగా ఉన్న చిత్రాలను కూడా రికార్డు చేస్తాయి. వీటి ప్రారంభ ధర రూ.3,800. జూమింగ్ కెమెరాల ధర రూ.4 వేల వరకు ధర పలుకుతోంది. జూమ్ చేయాలంటే దగ్గరుండి ఆపరేట్ చేయాల్సి ఉంటుంది. వీటిని అటు ఇటూ తిప్పుకునే అవకాశం ఉంది. ఎక్కువగా బంగారు దుకాణాల్లో వీటిని ఉపయోగిస్తుంటారు.



రామ్మూర్తినగర్‌లో భవనాలకు అమర్చిన కెమెరాలు



అందుబాటులో..

కెమెరాల వినియోగంలో డీవీఆర్ (డిజిటల్ వీడియో రికార్డింగ్)ను అనుసంధానం చేస్తారు. అంటే కెమెరాల తీసిన ప్రతి చిత్రం డీవీఆర్‌లో రికార్డ్ అయ్యి టీవీ స్క్రీన్‌పై కనిపిస్తుంది. అంతే కాకుండా డీవీఆర్ హార్డ్ డిస్క్ కెపాసిటీని బట్టి 15, 30 రోజులపాటు భద్రంగా ఉంటాయి. డీవీఆర్‌కు 500 ఎంబీ వేస్తే 15 రోజులు, ఒక జీబీ వేస్తే 30 రోజులపాటు రికార్డైన చిత్రాలు భద్రంగా ఉంటాయి. ఈ డీవీఆర్‌లు (ఫోర్ కెమెరాస్ సెట్) ప్రస్తుత మార్కెట్‌లో రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు లభిస్తున్నాయి.

రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ డైరెక్టర్ పదవికి రాజీనామా

ఆత్మకూరు: రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న ఆత్మకూరు పట్టణానికి చెందిన చిల్లూరు మంజూష బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య సతీమణి అయిన మంజూష ఆ సంస్థ డైరెక్టర్‌గా ఉన్న విషయం తెలిసిందే. రాజీనామాను విజయవాడలోని కార్యాలయానికి పంపినట్లు ఆమె తెలియజేశారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.80
సన్నవి : రూ.50
పండ్లు : రూ.35



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 154
లేయర్ (లైవ్)	: 120
బ్రాయిలర్ చికెన్	: 270
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 300
లేయర్ చికెన్	: 204



ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సుధాకర్‌రావు

నెల్లూరు(అర్బన్): రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ (హంస) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చేజర్ల సుధాకర్‌రావు, కమల్ కిరణ్ కోరారు. నెల్లూరులోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగులను ప్రభుత్వం గౌరవించాలని కోరారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తే తాము ప్రభుత్వానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ హంస గౌరవాధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్లు, ఓజిలి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డానియల్, మహిళా విభాగం గౌరవాధ్యక్షురాలు ఇందిర, నాయకులు పరిమళ, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఫ్యాన్సీ దుకాణాన్ని తగులబెట్టిన దుండగులు

- పెట్రోలు పోసి నిప్పంటించినట్లు గుర్తింపు
- రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని బాధితురాలి ఆవేదన

కొడవలూరు: గుర్తుతెలియని వ్యక్తులు ఫ్యాన్సీ దుకాణానికి పెట్రోలు పోసి నిప్పంటించారు. ఈ ఘటన మండలంలోని నార్తురాజుపాళెందిన్నెలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. నార్తురాజుపాళెందిన్నెలో ఇంకొల్లు హేమలత ఫ్యాన్సీ దుకాణం నడుపుతోంది. రోజూ లాగే మంగళవారం దుకాణం తెరిచి సాయంత్రం 7.30 గంటలకు దుకాణం మూసి వేసి ఇంటికెళ్లింది. అర్ధరాత్రి దుకాణం తగులబడుతోందని హేమలతకు ఫోన్ వచ్చింది. దీంతో ఆమె వెంటనే దుకాణం వద్దకు చేరుకుంది. అప్పటికే స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. ఫైరింజిన్ వచ్చి మంటలు వ్యాపించకుండా అదుపు చేసింది. అప్పటికే దుకాణంలోని సామగ్రి పూర్తిగా కాలిపోయింది. షాపునకు ఆనుకొని ఉన్న ఇంటికి నిప్పంటుకోకుండా అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోలు పోసి తగులబెట్టారని, తద్వారా రూ.3 లక్షల వరకూ నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐ సుబ్బారావు, ఏఎస్సై శ్రీనివాసులురెడ్డి బుధవారం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడ పెట్రోలు తెచ్చిన బాటిళ్లు, గ్లౌజ్‌లు, చెప్పులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఎవరో కావాలని దుకాణాన్ని తగులబెట్టినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.



కాలిపోయిన దుకాణంలోని వస్తువులు

15 నుంచి రైతు కూలీ సంఘం మహాసభలు

వెంకటగిరి రూరల్ : రైతాంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏలూరులో 15, 16, 17వ తేదీల్లో రైతు కూలీ సంఘం మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీవీ రమణయ్య తెలిపారు. బుధవారం పల్లెవీధిలోని శ్రీకాళహస్తి శేషయ్య భవనం వద్ద ఆయన సభల పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యుడు గంగలపూడి కృష్ణారెడ్డి, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.